
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 మే 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





'అల్లూరి'కి నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు : భారత స్వాతంత్య్ర చరిత్రలో ఒక మహోజ్వల శక్తి అని శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బి.వి.నగర్ లోని ట్రస్టు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులార్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత ఉపకార్మిక కమిషనర్ రాచపాలెం రఘు మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలను అర్పించిన యోధుడని ఆయన సేవల్ని కొనియాడారు. గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థపాక అధ్యక్షులు అరవ రాయప్ప, ట్రస్టు సెక్రటరి కె.మురళీమోహన్ రాజు, అల్లూరి రాజేష్ రాజు, ట్రస్టు సభ్యులు ఎమ్.రామయ్య, రాజారెడ్డి ఉన్నారు.



కరోనా 'బీమా' నగదు స్వాహా..!

కరోనా..
ఈ పేరు చెబితే 2019 నుంచి 2021 వరకు ప్రపంచమే నివ్వెరపోయింది. జిల్లాలో వేలాది మంది చనిపోయారు. ఏన్నో కుటుంబాలు పెద్దలను కోల్పోయి నిరాశ్రులైయ్యారు. పిల్లలు, పెద్దలు అనాథులుగా మిగిలారు. దాతల సాయంతో ఎందరో బయటపడ్డారు. ప్రభుత్వం కొందరికి సాయం చేయడానికి ఏర్పాటు చేసిన స్కీమ్‌ను ఓ దొంగల ముఠా పసికట్టింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారాన్ని దొడ్డిదారిలో స్వాహా చేసింది. ఇందు కూరుపేట బిట్-1 సచివాయలంలో బయటపడ్డ ఈ కుంభకోణంలో ఇప్పటి వరకు రూ 30 లక్షల బయటకొచ్చింది. జిల్లా వ్యాపితంగా కోట్ల రూపాయాలు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాపితంగా వందల కోట్లు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.. ప్రస్తుతానికి ముగ్గురు వ్యక్తులు కనిపిస్తున్నా.. దీని వెనుక పెద్ద యంత్రాంగమే ఉన్నట్లు తెలుస్తోంది. కలెక్టర్ విచారణ జరిపిస్తే ఇందులో జరిగిన అవినీతి బయటకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి...



ఇందుకూరుపేట బిట్-1 సచివాలయం

- ఊహకందని కుంభకోణం
- ఒక్క సచివాలయంలో రూ 30 లక్షలు
- విచారిస్తే వందల కోట్లు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

కరోనాతో ప్రపంచమంతా సర్వం కోల్పోతే అక్కడ మాత్రం శవాల మీద పేలాలు ఏరుకునేలా కొందరు వ్యక్తులు తయారైయ్యారు. 2019 నుంచి 2021 వరకు మూడు విడతలుగా వచ్చిన కరోనాతో పెద్ద ఎత్తున నష్టం జరిగింది. జిల్లా వ్యాపితంగా అధికారికంగా వెయ్యి మంది చనిపోయారని చెబుతుంటే అనధికారికంగా ఐదువేల మందికంటే ఎక్కువమంది చనిపోయారని తెలుస్తోంది. రెండో వేవ్‌లో పెద్ద ఎత్తున మృతి చెందారు. ప్రభుత్వాల సాయం అంటుంచితే.. మానవత్వం ఉన్న వ్యక్తులు పెద్ద ఎత్తున ఆపన్నహస్తం అందించారు. కుటుంబ పెద్ద కరోనాతో చనిపోవడంతో వేలాది మంది దిక్కుతోచని స్థితికి వెళ్లిపోయారు సుమారు 1.62 లక్షల మందికి జిల్లాలో కరోనా సోకింది. ఆ సమయంలోనూ పనులు లేక, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రజలు ఉన్నారు. 2021లో ప్రభుత్వాలు కొద్దిపాటి స్కీమ్‌లు ప్రవేశపెట్టాయి. బాధితులకు చిన్నపాటి సాయం ప్రకటించాయి. కరోనా మృతులతోపాటు, కరోనా సోకిన ప్రజలు, ఉద్యోగులకు చేయూతనిచ్చాయి. దీనినే కొందరు సోమ్ము చేసుకున్నారు. కరోనాను కూడా వదలకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు.

కరోనా బీమా నగదు స్వాహా..!

కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం బాధితుల కోసం (ఇన్సూరెన్స్ రిగ్యూలేటరీ ఆథారిటీ పాలసీ) పేరుతో కరోనా రక్షక్:, కరోనా కవచ్ అనే రెండు స్కీములు తీసుకొచ్చింది. కరోనా సోకి ఇబ్బందులు పడ్డ, చిన్న, పెద్ద తేడా లేకుండా బాధితులు, ఉద్యోగులు,సిబ్బంది కోసం కేంద్రం కరోనా పాలసీ తెచ్చింది. ఇది చాల మంది బాధులకు తెలియదు. కరోనా బాధితులకు సంబంధించిన పాజిటీవ్ సర్టిఫికేట్, ఆధార్, పాన్‌కార్డు, ఆసుపత్రి సర్టిఫికేట్, అకౌంట్ బుక్స్ లాంటివి ఆన్‌లైన్ చేసుకోవాలి. ఇన్సూరెన్స్ కంపెనీ ఒకొక్కరికి రూ లక్ష నుంచి రూ. 2,5 లక్షల రూపాయాలు బీమా సోమ్మును అకౌంట్‌లో వేస్తుంది. కరోనా రక్షిక్ కింద బిల్లులు పెట్టుకుంటే లక్ష వరకు వస్తుంది. కరోనా కవచ్ పాలసీ కింద బాదితులు 74 గంటలు ఆసుపత్రిలో ఉన్నట్లు సర్టిఫికేట్, కరోనా పాజిటీవ్ సర్టిఫికేట్ జత చేస్తే రూ 2.5 లక్షల వరకు బీమా వస్తుంది. దీనిని గుర్తించిన ఇందుకూరుపేట బిట్-1 సచివాలయంలో పనిచేసే మహిళా పోలీసు విజయలక్ష్మీ, నెల్లూరుకు చెందిన హోంగార్డు జలీల్, వాలంటీర్ భరత్ కుమార్ ఇక్కడ పనిచేసే ప్రజలు, ఉద్యోగులు, సిబ్బందిని బుట్టలో వేసుకున్నారు. ఈ స్కీమ్ కింద డబ్బులు ఇప్పిస్తామని , మీ ఆధార్, బ్యాంక్‌బుక్, పాన్‌కార్డు ఇవ్వాలని సచివాయలంలో పనిచేసే 15 మంది దగ్గర తీసు కున్నారు. వీరిలో కొందరికి కరోనా రాగ, కొందరికి కరోనా లేదు. అయినప్పటికీ ఈ వ్యక్తులు కరోనా పాజిటీవ్ సర్టిఫికేట్ సంపాదించారు. అప్‌లోడ్ చేశారు. విచారించి నగదు ఇవ్వాల్సిన ఇన్సూరెన్స్ అధికారులు కలిసి సుమారు రూ 30 లక్షల ఆయా సిబ్బంది అకౌంట్‌కు నగదు బదిలీ చేయించారు. ఒప్పందాల్లో భాగంగా ఒక్కొక్కరికి రూ 5 వేలు ఇచ్చి మిగిలిన సోమ్మును తమ అకౌంట్‌ను టాన్స్‌ఫర్ చేయించుకున్నారు. వీరి మధ్య విభేదాలు రావడంతో అసలు విషయం బయటకొచ్చింది. కేవలం ఒక్క సచివాయం పరిధిలోనే రూ 30 లక్షలు దిగమింగిన ఈ ముఠా జిల్లా వ్యాపితంగా ఎన్ని కోట్లు కాజేశారోనని అనుమనాలు కలుగుతున్నాయి. రాష్ట్ర వ్యాపింగా కోట్లాది రూపాయిలు కాజేసినట్లు అను మానాలు కలుగుతున్నాయి. ఆసుపత్రులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఇతర వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం విచారణ జరిపితే భారీ కుంభకోణం బయటపడే అవకాశాలు ఉన్నాయి. . దీనిని చూసిన జనం విస్తుపోతున్నారు. స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇందుకూరుపేటలో వారిపై ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు 15 మంది బాధితులుండగా సచివాలయ పరిధిలో మరో 50 మంది వరకు ఉంటారని తెలుస్తోంది. ఇది మండలం, జిల్లా, రాష్ట్ర వ్యాపింగా ఎలా ఉంటుందో చూడాలి.

'నాకు కరోనే రాలేదు ..

మోహన్‌కృష్ణ


నేను ప్రభుత్వ ఉద్యోగస్తుడిని కాదు. నాకు కరోనా రాలేదు. భయపెట్టి డబ్బులు కొట్టేశారు. నా అకౌంట్‌కు రూ 1.5 లక్షలు నగదు వచ్చింది. మహిళా పోలీసు విజయలక్ష్మీ నా దగ్గర నుంచి మొత్తం లాగేసు కుంది. నాకు ఒక్క రూపా యి కూడా ఇవ్వలేదు. నన్ను ఒత్తిడి చేసి ఆధార్, బ్యాంక్ అంకౌంట్ బుక్ జెరాక్స్ తీసుకున్నారు.



'నాకు రూ 5 వేలు ఇచ్చారు.

శ్రీవిద్య, వాలంటీర్

నేను ఇందుకూరుపేటలో వాలంటీర్‌గా పనిచే స్తున్నాను. నా దగ్గర నుంచి విజయలక్ష్మీ ఆదార్, బ్యాంక్ అకౌంట్ బుక్ తీసు కున్నారు. నా ఖాతాలో రూ 2 లక్షలు డబ్బులు పడింది. నాకు రూ ఐదు వేలు ఇచ్చారు. హోంగార్డు జలీల్ , విజ యలక్ష్మీ ఒత్తిడి తెచ్చారు. అందుకే 1.95 వేలు టాన్స్‌ఫర్ కొట్టేశాను.



సిపిఎం భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక 17వ డివిజన్ పరిధిలోని అపోలో వైద్యశాల సెంటర్‌లో సిపిఎం నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులకు శంఖుస్థాపన నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. మూలం రమేష్ మాట్లాడుతూ ఈ డివిజన్‌లో నిర్మిస్తున్న పార్టీ కార్యాలయానికి కమ్యూనిస్టు పోరాట యోధుడు, మాజీ శాసనసభ్యులు జక్కా వెంకయ్య నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. జక్కా వెంకన్న పేరుతో నిర్మిత మౌతున్న ఈ పార్టీ కార్యాలయంలో ఆయన ఆశయాలకు అనుగుణంగా ,నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసిన నాడే సార్థకత చేకూరుతుందన్నారు.సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు, స్థానిక శాఖ కార్యదర్శి కట్టా సతీష్ ఒక సామాన్య కార్యకర్తగా పార్టీ కార్యాలయా నిర్మాణానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు . సిపిఎం రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కిన్నెర కుమార్ , నగర కమిటీ సభ్యులు సూర్యనారాయణ, స్థానిక శాఖ మహిళా సంఘం నాయకులు ప్రజాసంఘాల నాయకులు, పార్టీ శ్రేయోభిలాషులు పార్టీ సాను భూతిపరులు, ఆటో కార్మికులు అందరూ పాల్గొని ఒక పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


శంకుస్థాపన చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి -పొదలకూరు : మండలంలోని తోడేరు గ్రామంలో రూ. 2. 60 కోట్లతో నిర్మించిన 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి, ఎంఎల్‌సి మేరిగ మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ తన తండ్రి కాకాణి రమణారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కల అయిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి 18 ఏళ్లపాటు పాటు ఈ ప్రాంతానికి సంబంధించి పొదలకూరు సమితి అధ్యక్షునిగా పనిచేశారన్నారు. తన తల్లి లక్ష్మీకాంతమ్మ తోడేరు గ్రామానికి 25 ఏళ్లపాటు సర్పంచ్‌గా పనిచేశారన్నారు. వారి హయాంలో ఈ ప్రాంతాన్ని ఎంతగానో అభివద్ధి చేశారని చెప్పారు. తాను మంత్రి అయ్యాక గ్రామానికి సంబంధించి మిగిలిపోయిన అభివద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తిరుపతి ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభమైనందున ఈ ప్రాంతం ప్రజలు నాణ్యమైన విద్యుత్ సరఫరాను పొందుతారన్నారు. గూడూరు శాసనసభ్యులు వరప్రసాద్ మాట్లాడుతూ కాకాణి రమణారెడ్డి ఈ ప్రాంత ప్రజలకు ఎన్నో సేవలందించారన్నారు. మండల వైసిపి జి. గోపాల్ రెడ్డి, కె. చిన్న బ్రహ్మయ్య, చంద్రశేఖర్ రెడ్డి, ఏనుగు శశిధర్ రెడ్డి, వాకాటి శ్రీనివాసులు రెడ్డి, ఎం. శేఖర్, మద్ది రెడ్డి రమణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.



'నీట్' పరీక్ష ప్రశాంతం

నెల్లూరు : ప్రతి ఏడాది మెడికల్, దంత, ఆయూష్ విద్యనభ్యసించేందుకు అర్హత పరీక్ష నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 5 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించింది. నగరంలో విఆర్ ఐఎఎస్, గౌమతి స్కూల్, వెంకటాచలం ప్రాంతంలోని అక్షరా విద్యాలయం, కోవూరులోని గీతాంజలీ కాలేజీ, కావలి లోనిఆర్ఎస్ఆర్ స్కూల్‌లో సుమారుగా 3 వేల 900 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.


వివాహవేడుకలో పోతుల, రాజేష్

వివాహానికి హాజరైన టిడిపి నేతలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మండలంలోని పోకూరులో వడ్లమూడి వెంకట్రావు, ఆదిలక్ష్మిల కుమారుడు రాజేష్-లక్ష్మీవిగ్నేశ్వరిల వివాహం ఆదివారం జరిగింది. ఆ వివాహ కార్యక్రమానికి మాజీ శాసన సభ్యులు పోతుల రామారావు, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణంలోని అంకమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణ పనులు ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతు న్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ పునర్ని ర్మాణానికి దాతలు భక్తులు స్పందిస్తున్నారు. ఉన్నారు. అందులో భాగంగా ఆదివారం పల్లాపు కొండయ్య భార్య సుశీల కుమారుడు పోతురాజు రూ.25,116లు, ఆర్టిజిఎస్ ద్వారా ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు యెనిమిరెడ్డి వెంకట రెడ్డి, ఆవుల మాధవరావుకు అందజేశారు.

ఘనంగా గ్రామోత్సవం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి జయంతి సందర్భంగా శనివారం రాత్రి కొండ కింద స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అధికారులతో పాటు అర్చకులు ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులు కూడా వేలాదిగా పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన వసతిని కాకర్లపాలెం యువత కల్పించింది. అన్నదానంను తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ ప్రారంభించారు. అన్నదాన సేవ చేస్తున్న యువకులను అభినందించారు.



నేడు 'స్పందన'

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కమీషనర్ వికాస్ మర్మత్ ఆకాంక్షించారు. సోమవారం నాడు నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగే స్పందన వేదికలో ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం 'డయల్ యువర్ కమీషనర్' కార్యక్రమంలో భాగంగా ఉదయం 9:30 నుంచి 10:30 వరకు 0861-2355678 నెంబరుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చును. కార్యాలయంలో కమీషనర్ ను నేరుగా కలిసి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చున్నారు.

'పది' ఫలితాలలో విద్యార్థుల ప్రతిభ

'పది' ఫలితాల్లో వివిధ పాఠశాలల విద్యార్థుల విశేష ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా మంచి ప్రతిభ కనబరిచారు. పేద విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించడం పట్ల పలువురు వారికి అభినందనలు తెలిపారు.

శేషు స్కూల్ విద్యార్థుల అద్భుత విజయం

నెల్లూరు డెస్క్ : 'పది' ఫలితాల్లో బుజబుజ నెల్లూరు లోని శేషు ఇంగ్లీష్ మీడి యం స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎస్ మనోగ్యవాణి 574, వై సాయి వర్ధన్ 573, జె.జీవన 570, జి.సోనాలిక 568, ఎం చరణ్ తేజ 552, కాజా నవాజ్ 550, వి.కష్ణప్రియ 515, కే.పురంధర్ 509, సి.చందన 501 అస్మత్ నీసా 500 మార్కులు సాధించారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వి. శేషు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారుఇంతటి ఘనవిజయానికి కారకులైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.



బాబా ఇంగ్లీష్ మీడియం స్కూల్ జయకేతనం

'పది' ఫలితాల్లో మహాత్మా గాంధీ నగర్‌లోని బాబా ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు చెందిన విద్యార్థులు షేక్ సమీర్ 577, అఫ్జల్ షరీఫ్ 575, సయ్యద్ ఆఫ్రీన్ 568, టి.నాగ శరణ్య 565, పి. అఫ్జల్ ఖాన్ 561, షేక్. గుల్నాన్ 550, షేక్. సోఫియా 460, ఎస్కే మునిబా ఫాతిమా 427, కే. హాసిని 416, వంటి మార్కులతో ఘన విజయం సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ షేక్.అమీర్జాన్ ప్రత్యేకంగా అభినందించారు.



'అదాని' విద్యామందిర్ విజయం

ప్రజాశక్తి-నెల్లూరు పది ఫలితాల్లో కృష్ణపట్నం ప్రాంతంలోని అదాని విద్యామందిర్‌కు చెందిన విద్యార్థిని విద్యార్థుల హవా కొనసాగింది. ఆదివారం అదాని పౌండేషన్ సైట్ హెడ్ రాజేష్ రంజన్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో అదాని విద్యామందిర్‌కు చెందిన ముత్తుకూరు ప్రాంతానికి చెందిన విద్యార్థులను పేరు పేరునా అభినందించారు. ఈ పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు పది పరీక్షల్లో ప్రతిభను కనపరిచి మంచి మార్కులు సాధించేందుకు కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాస రావును, ఉపాధ్యాయులను అభినందించారు.


'డిఆన్‌ఆర్' విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు : డిఎన్‌ఆర్ ప్రభుత్వ బాలికల హై స్కూల్ విద్యార్థులు మండల స్థాయిలో ఫస్ట్ సెకండ్ స్థానాలు కైవసం చేసుకున్నారు. వైష్ణవి 592, తేజస్విని 584, సాయి భార్గవి 582 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల కు పేరు తెచ్చారని, మండల విద్యాశాఖ అధికారులు ఆదివారం పేర్కొన్నారు.


తేజశ్వని వైష్ణవి సాయిభార్గవి

పేద విద్యార్థి సమీర ప్రతిభ

పది ఫలితాల్లో పొదలకూరు పట్టణంలోని నాగార్జున స్కూల్ విద్యార్థిని సమీర ఉత్తమ ఫలితాలు సాధించింది. సమీర 600 మార్కులకు గానూ 584 మార్కులు సాధించింది. దీంతో ప్రయివేటు పాఠశాలల స్థాయిలో నాగార్జున స్కూల్ మండల స్థాయిలో థర్డ్ ర్యాంక్ సాధించినట్లయింది. ఇదే పాఠశాలకు చెందిన కె ఉదయనాథ్ 558 మార్కులతో, డి కావేరి 526 మార్కులతో పాఠశాల స్థాయిలో ద్వితీయ, తతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో యాజమాన్యం అభినందించింది. కాగా సమీర తండ్రి కార్మికుడిగా పని చేస్తున్నాడు. తల్లి గహిణి. నాగార్జున స్కూల్ అడ్వైజర్ ఎన్ బాలు, ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గ ల ప్రోత్సాహం.. సహాయ సహకారాలు.. టీచర్ల అంకితభావంతో చేసిన బోధన తో తాను ఈ ర్యాంకు సాధించగలిగానని సమీర తెలిపింది.





అమరావతి హైస్కూల్ విద్యార్థుల జయభేరి

పొదలకూరు : 'పది' ఫలితాల్లో పొదలకూరులోని అమరావతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయభేరీ మోగించారు. పవన్ 579 ప్రీతి 573 సాయి 571, దీపిక 565, మానస564%దీ%.మనోజ్ 561, ఎస్.కె. వసీమ, 557, శివ 550 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపక బందాన్ని కరస్పాండెంట్ కె. సురేష్ అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులను సత్కరించారు.

టిడిపి విజయమే లక్ష్యం

నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆ పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామమైన బడేవారిపాలెంలో ప్రజాశక్తితో మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. రాష్ట్రంతో పాటు కందుకూరు నియోజకవర్గంలోనూ పసుపు జెండా తప్పనిసరిగా ఎగురవేస్తామనే ధీమా వ్యక్తం చేశారు. కందుకూరులో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పార్టీ కుటుంబ సభ్యులకు తమవంతు సహకారం అంద జేస్తున్నట్లు చెప్పారు. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు రానున్న ఎన్నికలలో 40 శాతం యువతకు అసెంబ్లీ సీట్లు కేటాయిస్తామని ప్రకటించారని, ఆ నేపథ్యంలో తనకు అవకాశం వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే తనవంతు ప్రయత్నాలు చేస్తున్నానన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంచి సంబంధాలున్నట్లు వివరించారు. పార్టీ కోసం కష్టపడిన వ్యక్తిగా తనను గుర్తిస్తుండటం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. గ్రామాలకు వెళ్లినప్పుడు ప్రజలు తనను ఆదరిస్తున్నారన్నారు. ముక్కుసూటిగా వ్యవహరించడమే తన సిద్ధాంతంగా చెప్పుకొచ్చారు. కొన్ని సందర్భాల్లో తనకు ఈ విధానంతో నష్టం జరిగినప్పటికీ, ఎదుటి వారు తనవల్ల నష్టపోకూడదన్నదే తన విధానమని ప్రకటించారు. పార్టీ అధిష్టానవర్గంతో పాటు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నాయకులు సైతం తన పట్ల సానుకూల ధోరణితో ఉన్నట్లు తెలిపారు. పార్టీ మారే ఆలోచనే లేదని స్పష్టం చేశారు. తనకు ఎవరితోనూ శత్రుత్వం లేదన్నారు. పార్టీ ఆదేశానుసారం, ఆ నాటి పరిస్థితులకు అనుగుణంగా పని చేసేందుకు సైతం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తనకు ఎంఎల్‌ఎగా పోటీ చేయాలనే కోరిక బలంగా ఉందన్నారు. కుట్ర రాజకీయాలు తెలియదన్నారు. నిజాయితీగా పని చేయడంలోనే తృప్తి ఉందన్నారు. యువత రాజేష్ వైపు మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు. చివరకు టిక్కెట్ ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.


ఇంటూరి రాజేష్

'ట్రస్ట్' ద్వారా నిరంతర సేవలు

తాను ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు రాజేష్ వివరించారు. భవిష్యత్తులో కందుకూరు ప్రాంతంలో వృద్ధాశ్రమం ఏర్పాటుచేసి, అందులో 500 నుంచి వెయ్యి మంది వరకు ఉండే అవకాశం కల్పించడమే తన ధ్యేయమన్నారు. తద్వారా పేద ప్రజలకు సేవ చేశాననే తృప్తి ఉంటుందన్నారు. భవిష్యత్తులోనూ తన సంపాదనలో పది శాతం సేవకు కేటాయిం చనున్నట్లు పేర్కొన్నారు. తన పేరు శాశ్వితంగా ఉండాలనే కోరిక ఉందన్నారు. ఆ మేరకు ప్రణాళికలు రచించి ముందుకు సాగుతున్నట్లు రాజేష్ తెలియజేశారు. నిజమైన పేదలను తమ వంతు ఆదుకునేందుకు ట్రస్టు ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు శారద నర్సింగ్ హోమ్‌లో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన కనిపించింది. శారదా నర్సింగ్ హోమ్ మూడో వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ గుండవరపు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 70 మంది వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందజేశారు. శారద నర్సింగ్ హోమ్‌లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించడానికి శారదా నర్సింగ్ హోమ్ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. రక్తదాన శిబిరాన్ని వెంకట శివాజీ షుమార్ట్ అధినేత నరసింహారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మణి, వెంకట శివాజీ షుమార్ట్ అధినేత గుండవరపు వెంకట శివాజీ పాల్గొన్నారు.

నెల్లూరు : ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి తెలిపారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతిని పురస్కరించుకుని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం, సి.పి.అండ్ పి.హెచ్. పి.డబ్ల్యూ.ఎ (పీఎంపీ) ఆధ్వర్యంలో సాధన ఆర్థోపెడిక్స్ వైద్యులు డా.పి.అశ్విన్ కుమార్, ఆకాష్ హాస్పిటల్ వైద్యులు డా.శ్రీవిద్య, మాధవ్ డయాబెటిస్ సెంటర్ టెక్నీషన్స్ శేషు, మురళి వారి సౌజన్యంతో మెగా ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, ప్రముఖ న్యాయవాది పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించటంతోపాటు మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం పీఎంపీ సభ్యులు అక్కడ ఉన్న వద్దులకు, పిల్లలకు పండ్లు, బిస్కెట్స్, చాకలెట్స్ పంపిణీ చేశారు.

సిఐటియు జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మండలంలోని అంకభూ పాలపురం ఎస్‌సి కాలనీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం మేడే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కాలనీ యువకులు జెండా దిమ్మెను నిర్మించారు. సిఐటియు జెండాను భవన నిర్మాణకార్మిక సంఘం నాయకులు మంగి లాజర్ ఆవిష్కరించారు. కెవిపిఎస్ జిల్లా కమిటి సభ్యులు గుండ్లతోటి మాధవమూర్తి, మండల కార్యదర్శి పివి రామారావు, సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్ మాట్లాడారు. ఎనిమిది గంటల పని కోసం చికాగో నగరంలో రక్తం చిందించి, కార్మికులు చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆ పని సమయాలను మార్చి, కార్మికులతో 12 నుంచి 14 గంటల వరకు పని చేయిస్తూ శ్రమదోపిడీ చేస్తుందని విమర్శించారు. కార్యదర్శి సాదు చెన్నకేశవులు, కెవిపిఎస్ మండల అధ్యక్షులు మంగి జక్రయ్య, సిఐటియు నాయకులు పర్రె భాస్కరరావు, గల్లా మాల్యాద్రి, మంగి సాల్మన్, డొక్కా నరసయ్య, దానియేలు, పేరయ్య, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిఎం రాయుడు, ఎం ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

'పది' ఫలితాలలో 'నలంద' విజయకేతనం



ప్రజాశక్తి-కావలి : పదో తరగతి పరీక్షా ఫలితాలలో నలంద విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ ఫలితాలలో నలంద నెల్లూరు బాలాజీ నగర్ బ్రాంచికి చెందిన పి.ఫర్హాన్ 600 మార్కులకుగానూ 594 మార్కులు, కావలి గాయత్రి నగర్ బ్రాంచికి చెందిన జె ప్రత్యూష 600 మార్కులకు గానూ 587 మార్కులు సాధించారు. ఈ ఫలితాలలో 22 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చెసిన అభినందన సభలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, డిఇఒ గంగా భవానీ, ఉప విద్యా శాఖాధికారి హరిప్రసాద్, నెల్లూరు బాలాజీ నగర్ బ్రాంచికి చెందిన పఠాన్, ఫర్హాన్‌ను అభినందించారు. నలంద విద్యాసంస్థల చైర్మన్ మజహర్ కావలి గాయత్రి నగర్ బ్రాంచికి చెందిన జె.ప్రత్యూషను అభినందించారు. కార్యక్రమంలో నలంద విద్యాసంస్థల డైరక్టర్స్ మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల అంకిత భావంతో ఈ విజయం సాధ్యమైందని ప్రశంసించారు.

విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్



ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ఎంఎల్‌సిలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.వి.రామ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని శ్రీధర్ గార్డెన్‌లో అపస్మా ఆధ్వర్యంలో ఎంఎల్‌సిల ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎంఎల్‌సిలను గజమాలతో వేసి సేలవాలతో ఘనంగా సన్మానించారు. అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఈగ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సివి రమణారెడ్డి, జిల్లా వైస్‌ప్రెసిడెంట్ ఎస్ రామ్మోహన్ రెడ్డి, నియోజకవర్గం అధ్యక్షుడు జి.ప్రభాకర్, మేధా స్కూల్ కరస్పాండెంట్ తోట చిన్న వెంకటసుబ్బయ్య, ఇతర ప్రయివేట్ పాఠశాల కరస్పాండెంట్లు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, తదితరులున్నారు.

లక్ష్మీపురంలో ఉత్సవాలు

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ మండలం, అన్నగారిపాలెం పంచాయతీ, లక్ష్మీపురం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన శ్రీ రాములవారి ఉత్సవాలకు కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు హాజరై, స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనను తిలకించారు. ప్రతేడాది జరిగే ఇటువంటి ఉత్సవాల్లో తాను తప్పక పాల్గొంటానని తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, వాయిల్ శ్రీనివాసులు, గోపాలపు నరసింహారావు, గ్రామపెద్దలు, కావులు, మామిడి వెంకటయ్య, పోతురాజు, వాయిల్ కనకయ్య, పులి రమేష్ యాదవ్, తాత శివ, తదితరులున్నారు.

కుట్టు మిషన్ వితరణ

ప్రజాశక్తి-కావలి : వెంగళరావు నగర్‌లో ఉన్న సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో పట్టణానికి చెందిన పచ్చిపులుసు వెంకన్న - పార్వతి దంపతుల కుమారుడు పచ్చి పులుసు వేదవ్యాస్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం తుఫాన్ నగర్‌లో నివాసం ఉంటున్న నిరుపేద మహిళ వీరమ్మకు స్వయం జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్ వితరణ చేశారు. కార్యక్రమంలో దాత పచ్చి పులుసు వెంకన్న, డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ పి.పద్మజ, మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు, విశ్రాంత లెక్చరర్ ఎస్.వి.ఎస్.ప్రసాద్ రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల పాల్గొని మహిళకు కుట్టు మిషను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బెజవాడ రవికుమార్, గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడారు.

డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు



సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నాయకులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని శ్రీహర్ష కోచింగ్ సెంటర్ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 6 అసోసియేషన్ 3వ జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఇందూరుపల్లి మణి ఆధ్వర్యంలో నిర్వహించారు. డిజిటల్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, వాటిని ఎలా అధికారం ద్వారా పరిష్కరించుకోవాలో చర్చించారు. సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బెల్లంకొండ మస్తాన్ బాబు, ఉపాధ్యక్షులుగా షేక్ షఫీక్, దుండిగం విష్ణు, జనరల్ సెక్రెటరీగా నెల్లూరు శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా షేక్ తస్లీం, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పవ బాక లోకేష్, సతీష్, మిండుర్తి … షేక్.అష్రఫ్, నాగయ్య, కిషోర్‌లను ఎన్నుకున్నారు.

విద్యార్థినికి ప్రశంసలు



ప్రజాశక్తి-ఇందుకూరుపేట : నారాయణరెడ్డిపేటలోని శ్రీ సత్యసాయి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కొత్తూరు గ్రామానికి చెందిన విద్యార్థి షేక్ సోనియా 600 మార్కులకు గాను 547 మార్కులు సాధించడంతో సిబ్బంది మండల కార్యదర్శి ఎస్.కె.చాన్ భాషా ఆధ్వర్యంలో కొత్తూరు గ్రామంలోని పలువురు నాయకులు, గ్రామస్తులు సోనియాను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులందరితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొమరిక విద్యార్థినికి మొదటి స్థానం



ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలోని జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థి వై.సుష్మ 576 మార్కులు సాధించి మండలంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఎంఇఒ శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని అభినందనలు తెలియజేశారు.



ప్రజాశక్తి-జలదంకి : జలదంకి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. జలదంకి గ్రామానికి చెందిన పులుగుంట లక్ష్మీ శ్రీనిధి 600 మార్కులకు గాను 581 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆదివారం ప్రధానోపాధ్యాయులు వేమూరి కొండారెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం వై.మాల్యాద్రి, డి.భారతి దేవి, జి.కోదండ రామిరెడ్డి, వి.మాధవి, రాజశేఖర్, విద్యా కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, పాఠశాల కోఆప్షన్ సభ్యులు పులుగుంట మధు మోహన్ రెడ్డిలు లక్ష్మీ శ్రీనిధి, పి. గాయత్రీ లకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపి మిఠాయిలు పంచిపెట్టారు. ప్రతిభ చూపిన ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

తుమ్మల సుమాంజలికి అభినందనలు

ప్రజాశక్తి-కావలి : పట్టణంలోని వెంగళరావు నగర్ శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ హై స్కూల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తుమ్మల సుమాంజలికి 580/600 మార్కులు వచ్చిన సందర్భంగా ఆదివారం "హ్యూమ్ సేవా సంస్థ" ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పూలమాలలతో సత్కరించి నగదు బహుమతి అందజేశారు. బండి వెంకట్ కుమార్, సహకారంతో రూ.1500 రూపాయలు నగదు అందజేశారు. తదుపరి సంస్థ తరఫున సుమాంజలి తో పాటు వారి తల్లిదండ్రులకు అందరికీ స్వీట్స్ పంచారు. హ్యూమ్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ గని భాషా మాట్లాడారు. కార్యక్రమంలో సయ్యద్ ఘనీ భాషా, సంస్థ సలహాదారులు ప్రభుత్వ సెక్రెటరీ మారుబోయిన నాగరాజు, షేక్ బాజీబాషా, ఎం.వి.ఎస్. ప్రసాద్ రావు, విద్యార్థిని తల్లిదండ్రులు తుమ్మల సురేష్, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని కొత్తవంగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురం గ్రామంలో టిటిడికి సంబంధించిన రూ.10 లక్షల నిధులతో వినాయకుడి గుడికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈ నిధుల మంజూరు కావడానికి సహకరించిన కోవూరు ఎంఎల్ఏ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, డిసిఎంఎస్ డైరెక్టర్ పీకే చలపతిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తవంగల్లు పిఎసి ఇంఛార్జ్ చక్కా మనోహర్‌బాబు, ఉపసర్పంచ్ చక్కా తైలజ, నాయకులు వేమూల వెంకటేశ్వర్లు, చక్కా శాంతం హరిబాబు, చక్కా రామయ్య, వేమూల రమణయ్య, విడవలూరు వెంకటేశ్వర్లు, వీరయ్య, రాఘవేంద్ర, వద్దయ్య, దశయ్య, సురేష్, నవీన్, కొంజేటి రమేష్, కొంజేటి శేషగిరి, చక్కా మాల్యాద్రి, శ్రీనివాసపురం పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ ప్రసన్న రథోత్సవం

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని నార్తు రాజుపాలెం గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండుగ సాగింది. ఆదివారం పోతిరెడ్డి దిలీప్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి రథోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏ ఆలయంలో … స్వామివారి బ్రహ్మోత్సవాలు జరిగినందుకు ప్రతి దిపాల్గొంటేకు ధన్యవాదాలు తెలిపారు.

3.4 లక్షల మందికి సామాజిక పింఛన్లు

డిఆర్‌డిఎ పిడి సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 3.4 లక్షల మందికి 16 రకాల సామాజిక పెన్షన్లు అందజేస్తుందని డిఆర్‌డిఎ పిడి సాంబశివారెడ్డి తెలియజేశారు. పలు కారణాలతో జిల్లాలో వేల సంఖ్యలో లబ్ధిదారులకు పెన్షన్ నిలిపివేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంత మంది లబ్ధిదారులకు పెన్షన్లు నిలిపివేస్తున్నారో డిఆర్‌డిఎ పిడి సాంబశివారెడ్డి మాటల్లో...

ప్రశ్న. జిల్లాలో ఎంత మంది లబ్ధిదారులకు పెన్షన్లు నిలిపివేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం నోటీసులు అందజేసింది. నోటీసులు అందుకున్న వారిలో ఎంత మంది ఆధారాలు చూపించి తమ పెన్షన్‌ను పునరుద్ధరించుకున్నారు..?

జవాబు. జిల్లాలో 3.4 లక్షల మంది 16 రకాలకు సంబంధించిన సామాజిక పెన్షన్లు అందజేస్తున్నాం. అయితే వివిధ కారణాల నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు 12 వేల మందికి పెన్షన్లు నిలిపివేస్తున్నట్లు డిసెంబర్‌లో నోటీసులు అందించిన మాట వాస్తవమే. అయితే వీరిలో 8 వేల మంది లబ్ధిదారులకు పెన్షన్ పునరుద్ధరించడం జరిగింది. వీరందరికీ పెన్షన్ నగదు అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. పెన్షన్లు తీసుకుంటున్న లబ్ధిదారుల పేరుతో పరిమితికి మించి ఇళ్లు ఉండటం, భూములు ఉన్నాయని, వాహనాలు కలిగి ఉన్నారని, నెలకు విద్యుత్తు వినియోగం 300 యూనిట్లకంటే అధికంగా నమోదు కావడం వంటి కారణాలు ప్రభుత్వ రికార్డుల్లో గుర్తించడంతో అధికారులు నోటీసులు అందజేశారు. ప్రభుత్వం నుంచి నోటీసులు తీసుకున్న 12 వేల మందిలో 8 వేల మంది తమ పేరుతో నివాస గృహాలు, భూములు, వాహనాలు లేవని, విద్యుత్తు వినియోగం 300 యూనిట్లకంటే తక్కువగా వినియోగించుకుంటు న్నామంటూ తగిన ఆధారాలు అధికారులు అందజేశారు. లబ్ధిదారులు చూపిన ఆధారాలను పరిశీలించిన అధికారులు అర్హులైన వారికి పెన్షన్లు పునరుద్ధరించారు.



ప్రశ్న. ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్ తీసుకొనేందుకు అనర్హులుగా ఎంతమందిని అధికారులు నిర్ధారించారు. వీరందరికీ ఎప్పటి నుంచి పెన్షన్ నిలిపివేస్తున్నారు..?

జవాబు. ప్రస్తుతానికి అధికారులు రికార్డులన్నీ నిశితంగా పరిశీలించి 2700 మంది పెన్షన్లు తీసుకొనేందుకు అనర్హులుగా గుర్తించారు. వీరందరికీ జనవరి నుంచి పెన్షన్లు నిలిపివేస్తున్నాం. నోటీసులు అందుకున్న మరికొంత మంది లబ్ధిదారులకు సంబంధించిన ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులను పరిశీలిస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందజేస్తాం. అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వం పెన్షన్ అందజేస్తుంది.

ఇంటర్వ్యూ

ప్రశ్న. ప్రభుత్వం కుంటి సాకులు చూపించి అవ్వాతాతలకు పెన్షన్ నిలిపివేసిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణల్లో ఎంత నిజం ఉంది. సరికొత్తగా పెన్షన్లు మంజూరు ఏమైనా చేశారా..?

జవాబు. అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారుడికి పెన్షన్ అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అందులో భాగంగా పెన్షన్ తీసుకొనేందుకు తాము అర్హులమంటూ దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి కొత్తగా 12,332 పెన్షన్లు మంజూరు చేశాం. అర్హులైన వారికి పెన్షన్ ప్రభుత్వం నిలిపివేసిందంటూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు జనవరి నుంచి అదనంగా మరో రూ.250లు అందజేస్తున్నాం. పెంచిన పెన్షన్‌తో కలిపి ప్రతినెలా వృద్ధులకు రూ.2750లు 1వ తేదీ ఉదయాన్నే ఇంటి వద్దకు తీసుకెళ్లి మరీ అందజేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న. నూతన సంవత్సరం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఏయే కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారు..?

జవాబు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పలు కార్యక్రమాలు చేస్తుంది. నూతన సంవత్సరం సరికొత్త కార్యక్రమాలు అమలుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు పొట్టేళ్ల పిల్లల పంపిణీ, పెరటి కోళ్ల పంపిణీ, పరిశ్రమల స్థాపనకు ఉత్సాహం చూపిస్తున్న సంఘం సభ్యులను ప్రోత్సాహిస్తున్నాం. ఈ ఏడాది ప్రతి పొదుపు మహిళ అదనంగా రూ.10 వేల నుంచి రూ.15 వేలు సంపాదించుకొనేందుకు అనుకూలంగా ప్రతి నియోజకవర్గ పరిధిలో షాపింగ్‌మాల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించాం.



అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు

- అన్నదాన కార్యక్రమం

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. నరసింహకొండలో అంగరంగ వైభవంగా సాగుతోన్న ఈ ఉత్సవాల్లో తన పూర్వీకుల సాంప్రదాయన్ని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ కొనసాగిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన అన్నదాని కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టలైన గరుడ సేవ, పూలంగి సేవ, కళ్యాణం, రథోత్సవం రోజున ఉదయం అంబలి, మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమాలు చేపట్టమన్నారు. ఇది తమ పూర్వీకులైన సంప్రదాయంగా నిర్వహిస్తున్నామన్నారు. గత 70 క్రితం మా పూర్వీకులు ఇక్కడ స్థలాన్ని కొని అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి నేతత్వంలో బ్రహ్మోత్సవాలు నా భూతో నా భవిష్యత్తు అన్న రీతిలో నిర్వహించడం జరిగింది అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

గిరిజనులకు వైసిపి చేసిందేమీ లేదు..

ప్రజాశక్తి-కావలి

వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గిరిజనులకు చేసిందేమీ లేదని, శూన్యమని కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు మొగిలి కల్లయ్య మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎస్‌టిలను గాలికి వదిలేసారని వారంటే ఎందుకింత చిన్నచూపో అర్థంకావడం లేదన్నారు. రాష్ట్రంలో వైసిపి వారు దుష్ట పాలన కొనసాగిస్తున్నారని, సైకో జగన్ పాలనకు స్వస్తి పలికే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. గిరిజనులు అభివృద్ధి చెందాలంటే ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. అనంతరం మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ గిరిజనుల కోసం ఈ వైసిపి ప్రభుత్వం ఏం చేసిందో వివరించాలని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలు సృష్టించిన ఘనత జగన్‌దేనని తెలిపారు. గిరిజనులపై దాడులు సృష్టిస్తూ, వారి జీవితాలను అధోగతిపాలు చేస్తున్న ఈ వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. టిడిపి హయాంలో గిరిజనుల కోసం లోన్లు, మర బోట్లు, ఎన్నో రకాలైన ఉపాధి కల్పనకు రూపకల్పన చేస్తే, ప్రస్తుతం అటువంటి పథకాలన్నీ రద్దుచేసి ఎస్‌టిల పొట్ట కొడుతున్నారని ఎద్దేవా చేశారు. గిరిజనులకు అండగా ఉండే ఏకైక ప్రభుత్వం టిడిపి అని, రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తు చేశారు. పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, పార్టీ ఎస్‌టి ముఖ్య నాయకులు ఆవుల సురేష్, పొట్లూరి వెంకటేశ్వర్లు, రావూరి రాధమ్మ, టి.అనురాధ, మొగిలి విజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, కళ్యాణ్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ఫణికుమార్

నేడు వేలం నిర్వహణ

ప్రజాశక్తి-అల్లూరు

నగర పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఫణి కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8న సోమవారం అల్లూరుపేటలోని నగర పంచాయతీ కార్యాలయంలో వేలంపాటలు నిర్వహిస్తున్నందున ఉదయం 10:30 గంటలకు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. రోడ్డు మార్జిన్ వ్యాపారాలు చేసుకునే వారి వద్ద వసూళ్లకు ధరావత్తు రూ.10వేలు, అలాగే బస్టాండ్ ఫీజుకు 10వేలు, నార్తొమోపూరు చెరువుకు రూ. 25వేలు, నార్తొమోపూరు చేపల గుంటకు 10వేలు ధరావత్తు చెల్లించాలని కోరారు.

పోరాట యోధుడు నాగూర్ సాహెబ్

ప్రజాశక్తి-సీతారామపురం

రైతు కార్మికుల గుండెల్లో నిలిచిన పోరాట యోధుడు నాగూర్ సాహెబ్ అని జిల్లా సిపిఎం నాయకులు పేర్కొన్నారు. మార్చి 28వ తేదీన బసినేనిపల్లి మాజీ సర్పంచ్ అగ్ని గుండాల నాగూర్ సాహెబ్ వడదెబ్బ కారణంగా మరణించిన విషయం విధితమే. శనివారం రాత్రి ఆయన స్వగ్రామంలో సంతాప సభ నిర్వహించారు. ముందుగా నాగూర్ సాహెబ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వెనుకబడి తరగతులకు చెందిన పేద కుటుంబం నుండి వచ్చి తుది శ్వాస వరకు పేదల సమస్యల పరిష్కారం కోసం పాత ఉదయగిరి తాలూకాలో పలు పోరాటాలకు సారథ్యం వహించి పోరాడిన మహోన్నత వ్యక్తి నాగూర్ సాహెబ్ అని గుర్తు చేశారు. వివాదం లేని సిపిఎం నాయకుడిగా ప్రజల మన్ననలను పొందారున్నారు. ఉదయగిరి సిపిఎం కమిటీ సభ్యునిగా, మండల సభ్యునిగా, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలను ఎంతో నిబద్ధతగా నిర్వహించారని, సీతారామపురం మండలంలో జరిగిన అన్ని పోరాటాలలో ఎదురొడ్డి నిలబడ్డాడని ఆయన మరణం ఆయన కుటుంబానికే గాక ప్రజాతంత్ర ఉద్యమాన్నికి తీరని నష్టాన్ని చేకూర్చిందన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి నాగూర్‌సాహెబ్ అని, అత్యంత కఠిన పరిస్థితులలో నమ్మిన సిద్ధాంతాల కోసం నిలబడి పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు, పి.శ్రీరాములు, కె.అజయ్‌కుమార్, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య, మండల సిపిఎం నాయకులు కోడె రమణయ్య, ఎపి రైతుసంఘం మండల అధ్యక్షుడు చింతనబోయిన రత్తయ్య, జెవివి నాయకుడు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు



అల్లూరి సీతారామరాజుకు నివాళులు

ప్రజాశక్తి-కోవూరు : అల్లూరి సీతారామరాజు 95వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక సీతా పోలయ్య భవనంలో వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. అనంతరం గాంధీ సంఘం శాఖ సభ్యులు ఎస్.కె.చాన్‌భాషా మాట్లాడుతూ మన్యం ప్రజల కోసం అల్లూరు సీతారామరాజు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అప్రోజు చాన్‌బాషా, ఎస్‌కె బాబు, ఖాదర్‌బాషా, సర్దారు, సుబ్బారావు, మాబాషా, కాలేషా, రామయ్య, హుమాయును, కరీముల్లా, సురేంద్ర, సీనయ్య, ఖాదర్ బాషా, అఖిల్ అహ్మద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హైలెవల్ కెనాల్ నిర్వాసితులను ఆదుకుంటాం

- ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి

ప్రజాశక్తి-మర్రిపాడు

హైలెవల్ కెనాల్ నిర్వాసితులను ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడొద్దని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పడమటినాయుడుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ముమ్మరంగా పర్యటించిన ఎంఎల్‌ఎ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామస్తులు హైలెవల్ కెనాల్ నిర్మాణంలో తమ పొలాలు, స్థలాలు ముంపునకు గురవుతున్నాయని, ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు పరిహారం అందలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాక రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు కాకుండా వేరేవారి పేర్లు నమోదయ్యాయని అధికారులు తెలుపుతున్నారని, ఈ సమస్యలను పరిష్కరించాలని ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ హైలెవల్ కెనాల్ నిర్మాణం 1, 2 ఫేజ్‌లలో జరుగుతుందని, గత ప్రభుత్వ హయాంలో ఈ పనులు సాగక ఏళ్లు గడిచిపోయాయని, ప్రస్తుతం ఫేజ్ – 2లో పనులు జరుగుతున్నాయని వివరించారు. రైతుల వద్ద నుంచి భూముల హైలెవల్ కెనాల్ నిర్మాణ పనుల కోసం తీసుకున్నారని, ఆ పరిహారం విషయమై చర్చిస్తామన్నారు. హైలెవల్ నిర్మాణంలో రోడ్ల నిర్మాణాలు సైతం జరగడం లేదని, ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను కలిసి విషయాన్ని వివరించామన్నారు. జూన్‌లో స్పెషల్ కలెక్టర్‌తో కలసి గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలన్నింటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, మండలంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలను సాధ్యమైనంత త్వరగా వేరే ప్రాంతానికి తరలించి వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించి సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, సర్పంచ్ జయమ్మ చిన్న కొండయ్య, జెసిఎస్ కన్వీనర్ మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు మన్నె బాలకొండరెడ్డి, రామ్‌గోపాల్ రెడ్డి, అంగడి కొండారెడ్డి, గిన్నె వెంకటేశ్వర్లు, పోలిరెడ్డి చిన్నారెడ్డి, వార్డుమెంబర్ మేకల శేఖర్, ఎస్‌సిసెల్ నాయకులు అద్దంకి రామకృష్ణ, శిల్పం బాలకొండయ్య, అల్లంపాడు సచివాలయం కన్వీనర్ మౌలాలి, కృష్ణ ప్రసాద్‌రెడ్డి, బోదవాడ ప్రతాపరెడ్డి, రామకృష్ణారెడ్డి, మీరావలి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి



కరోనా రక్షక కవచ్ పాలసీ నిధులు గోల్‌మాల్

- వైసిపి నేత ఫిర్యాదుతో వెలుగులు చూసిన ఘటన

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

కరోనా రక్షక కవచ్ నిధులను గోల్‌మాల్ చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఇందుకూరుపేట వైసిపి నేత గుణపాటి సురేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందుకూరుపేట ఒకటవ సచివాలయంలో కరుణ రక్షక కవచ్ స్కీమ్‌ను అడ్డుపెట్టుకుని వాలంటరీలు, ఎఎన్‌ఎంల నుండి రూ.30 లక్షల మేర నగదు కాజేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇందులో మహిళ కానిస్టేబుల్ సచివాలయంలో పనిచేస్తున్న వాలంటీర్లను, సచివాలయ సిబ్బందిని బురిడీ కొట్టించి ఇప్పటి వరకు రూ.30 లక్షలు మేర కాజేసినట్లు ఆయన తెలిపారు. వాలంటీర్లను, సచివాలయ సిబ్బందినీ సుమారు 15 మందికి పైగా మోసం చేసిన మహిళ పోలీసు, హోంగార్డులపై ఉన్నతాధికారులు స్పందించి శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గురజాల జ్ఞాన స్వరూప్, భాను నాయుడు, వాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కక్ష సాధింపులతో తెలంగాణకు కంపెనీలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ముఖ్యమంత్రి, మంత్రులు అమర్‌రాజా బ్యాటరీ కంపెనీపై రాజకీయ కక్ష చూపించడంతో తెలంగాణకు కంపెనీ వెళ్లిందని టిడిపి రాష్ట్ర కార్యవర్గ నిర్వహణ కార్యదర్శి మాజీ జెడ్‌పి చైర్మన్ విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ పక్క రాష్ట్రమైన తెలంగాణలో నెలకొల్పడం దురదృష్టకరమని భారతదేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన అమరరాజా బ్యాటరీ కంపెనీ ఎనిమిది రాష్ట్రాలు ఆహ్వానిస్తే సొంత రాష్ట్రంలో ఉన్న కంపెనీపై కత్తి సాధింపు చర్యలు ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు కూడా జరుగుతున్న విషయాలను గుర్తించి జరగబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన హితవు పలికారు.

వరికుంటపాడులో కొండచిలువ కలకలం

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తూర్పు బోయమడుగుల గువ్వాడి మధ్యలో కొండ చిలువ కలకలం రేపింది. పరిసర ప్రాంతాలంతా అటవీ ప్రాంతం పొలాలు కావడంతో ఆదివారం రోడ్డుపైకి వచ్చింది. అటుగా వెళుతున్న వారు కొంతమంది చూసి తొలుత భయానికి గురి అయినప్పటికీ అది విష జంతువు కావడంతో దానివల్ల ఎవరికైనా ప్రమాదం పొంచి ఉందని, దానిని కొట్టి చంపారు. ఎక్కువగా కొండ సిలువలు ఉన్నాయని పశువుల కాపరులు హడలెత్తిపోతున్నారు.

జర్నలిస్టు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి-ఉదయగిరి

పలు పత్రికలో విధులు నిర్వహిస్తూ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం సీనియర్ జర్నలిస్ట్ పెనుబర్తి మల్లికార్జున్(54) మృతి చెందారు. మృతునికి భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు. అతని మృతి పట్ల నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పలువురు రాజకీయ నేతలు, మిత్రులు, బంధు మిత్రులు ఘన నివాలుర్పించి అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమవారం ఉదయం దుత్తలూరులోని తన స్వగ్రామంలో దహన సంస్కారాలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



రోడ్డు పనులు ప్రారంభం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి వరికుంటపాడు



మండలంలోని విరువూరు నుంచి పామూరుకు మధ్యలో పెద్దపెద్ద గుంతలతో రోడ్డు దర్శనమిస్తుండడాన్ని ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించగా అధికారులు స్పందించి ఆదివారం రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ రోడ్డులో ఆటోలు ద్విచక్ర వాహనదారులు గోతులమయంగా ఉన్న రోడ్డుతో పలుదపాలు యాక్సిడెంట్లు గురైన సందర్భాలు కోకొల్లలుగా ఉండేవి. ఈ రోడ్డు పరిస్థితిపై ప్రజాశక్తి పలుదఫాలు ఆర్‌అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ఆదివారం నుంచి రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులు ప్రజాశక్తి దినపత్రికకు అభినందనలు తెలియజేశారు.

56వ సారి రవికుమార్ రక్తదానం

ప్రజాశక్తి-కావలి : కావలి ఎపిఎస్ ఆర్‌టిసి డిపో మేనేజర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కొర్లు రవికుమార్ ఆదివారం రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో 56వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు రవికుమార్‌ను అభినందించారు. కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డాకారపు రవిప్రకాష్ మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగి రవికుమార్ స్వయం ప్రేరణతో, ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తుంటారన్నారు. అంతేకాక నేత్రదానం, అవయవదానాల గురించి అవగాహనా కార్యక్రమాలు చేస్తుంటారని తెలిపారు. 6వ సారి రక్తదానం చేసిన రవికుమార్ కుమారుడు కొర్లు వెంకట చిరంజీవిలను రెడ్‌క్రాస్ సిబ్బంది సత్కరించారు. కార్యక్ర మంలో మధుసూర్య, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో దెబ్బతిన్న మొక్కజొన్న పంట

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఇటీవల కాలంలో మండలంలో అకాల వర్షాలు పడడంతో వరి, మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతింది. ఈ మేరకు రైతులు తడిచిన పంటను చూసి లబోదిబో మంటున్నారు. మండలంలో రబీ సీజన్లో రైతులు వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. ముందుగా కొందరు రైతులు సాగు చేసిన పంటలను కోతకోసి ధాన్యం ఇళ్లకు చేర్చుకొని విక్రయించుకున్నారు. ఆలస్యంగా పంటలు సాగు చేసిన రైతులు మాత్రం తీవ్రంగా పంటలను నష్టపోయారు. వరికుంటపాడు, జడదేవి, తూర్పు బోయమడుగుల, గువ్వాడి, కాంచెరువు తదితర గ్రామాల్లో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు సుమారు 30 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. అలాగే కొందరు రైతులు మొక్కజొన్న పంటను ఆరబెట్టుకుంటూ ఉండగా వర్షం కురవడంతో పూర్తిగా తడిసిపోయి పంట దెబ్బతినింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటసాగు చేసి చివరకు చేతికందే సమయంలో ఇలా అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. మండల వ్యాప్తంగా ఒక మోస్తరు వర్షం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. తూర్పు బోయమడుగుల గ్రామంలో కల్లాల్లో ఉంచిన మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. దీంతో భారీగా నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వర్షంలో తడుస్తున్న పంటను భద్రపరుస్తున్న రైతులు